బహుమతి పొందిన కథ

• స్వాతి వారపత్రిక. అక్టోబరు 18, 2002.

# గోరింట పండింది

ఆరుబయట మామిడి చెట్టుకింద దుప్పట్లూ, జంబుకానాలు పరుచుకుని కూర్చున్నారు కొందరు స్నేహితురాళ్ళు. వనమహోత్సవ సందడి... ఆ పెళ్ళి సందడి! రంగు రంగుల సీతాకోకచిలుకల్లా ఆ పెరటితోటంతా వందన స్నేహితురాళ్ళే! పలకరింతలు...పులకరింతలు...నవ్వులు...వెక్కిరింతలు... వేళాకోళాలు...

"అబ్బ! దీని అరచేతులు చూడవే, ఎంత తెల్లగా మెత్తగా వున్నాయో" అన్నదో స్నేహితురాలు.

"ఎందుకుండవూ? ఇంట్లో ఎప్పుడైనా ఏపనైనా చేస్తేగదా!, ఆ మెత్తనివీ, తెల్లనివీ అన్నీ ఆయనగారి సొత్తే..."

"ఛీ పొండే..."అంటూ తనచేతుల్ని ఆమె చేతుల్లోంచి చటుక్కున లాగేసుకొంది వందన. ఆ అమ్మాయి ముఖంలో అప్పుడే పెళ్ళికళ దోబూచులాడుతోంది.

అప్పటికి ఇక మూడు రోజులేవుంది పెళ్ళి. పెళ్ళి కూతుర్నిచేసే హడావిడిలో వందనచేతులకు గోరింటను అలంకరించే పనిని తాను తీసుకుంది జీవిత. ఆమె పట్నంలో ఓ చిన్న బ్యూటీక్లినిక్‌ను నడుపుతోంది.

"నీకు నచ్చిన డిజైన్ చెప్పు. ఇది చుక్కల్లో నెలవంక. ఇది తారాచంద్రులు, ఇది జంట మామిడి పిందెలూ ఆ వెనుక అందంగా ఆకు! ఇది పన్నీరు బుడ్డి, ఇది పల్లకీ... నీకేది నచ్చితే అది" అంటూ డిజైన్ల పుస్తకంలోని పేజీల్ని ఒక్కొక్కటే తిప్పుతూ చూపిస్తోంది.

"గోరింట పూచింది కొమ్మలేకుండా... మురిపాల అరచేత మొగ్గ తొడిగింది" అంటూ తన శ్రావ్యమయిన కంఠంతో పాటెత్తుకుంది లాలస.

"ఎంచక్క పండిన ఎర్రనిచుక్క... చిట్టి పేరంటాలికి శ్రీరామరక్ష... కన్నె పేరంటాలికి కలకాలం రక్ష..." ఆమె గొంతులో గొంతు కలిపింది మాధవి.

"అవునేపెళ్ళికూతురా ఈ పాటెందులోదో చెప్పు?"

"తెల్సులే" అంటూ నవ్వేసింది వందన.

"మరైతే దీని రచయిత ఎవరో...?"

"ఇంకెవరూ? మల్లీశ్వరి పాటల రచయితే, అవునా?"అంది వందన విజయగర్వంతో.

"పాటల సంగతి తర్వాత. ముందీ సంగతి చెప్పు" చేతిని సుతారంగా నొక్కింది జీవిత.

"పల్లకీ డిజైన్ వందన కిష్టం. కదే." అంది మాధవి. "ఎంచేతో" అడిగింది జీవిత.

"ఎంచేతనంటే - పెళ్ళయ్యాక ఇద్దరూ ఎక్కేది దానిపైనే కదా" నవ్వుతూ అంది మాధవి

"ఇంకా నయం - పందిరిమంచం అన్నావు కావు...!

అక్కడంతా నవ్వులు!నవ్వులు!నవ్వులు!

"అయినా నీ పల్లకీ డిజైన్‌లో కొత్త దంపతులేరే"

"నయం కొత్త దంపతులు తలలు పైకి పెట్టుకుని చూస్తూ కూర్చుంటారా, తమని తాము చూసుకుంటూ తమ పనిలో తాముంటారుగాని. అందుకే తెరలు!"

"ఛీ నాకంటే మీకు ముందు పెళ్ళిళ్ళయిపోవడం కాదుగానీ బరితెగించి పోయారే" అంది వందన.

"అయితే మరి నీకు పల్లకీ డిజైను ఓకేనా?" అడిగింది జీవిత. ఇష్టమేనన్నట్లు తలూపింది వందన, కుడి అరచేతిని ఆమె ముందుకు చాపుతూ.

"ప్రాణసఖుడె నా కోసమె పంపినా...పల్లకీ అన హృదయమ్ము జల్లుమనియె" అది ఏ ఖండ కావ్యములోనిది? దీని కవి ఎవరు?" నవ్వుతూ అడిగింది లాలస.

"వీళ్ళింట్లో టీవీ లేకపోవడం, తాతగారి పుస్తక భాండారంలో వందలకొద్దీ పుస్తకాలుండడం కాదుగానీ, అవన్నీ చదివేసి సామాన్యులమీద ప్రశ్నలు కుప్పించేస్తోందిది" అంది జీవిత లాలసవంక చూస్తూ.

"కొసరు నడల తూగాడుచు కూరుచుంటి

పూలపల్లకిలో పూలమాల నేను. దయచేసి నన్ను డిస్టర్బ్ చెయ్యకు" అంది వందన.

"చాల్లే గ్రహించాలే. ఇక నీ పని కానియ్" అని అందరి వంకా చూసి "ఇంటర్లో తెలుగు తన్నేసినా అది నయం మీకంటే. అయినా తెలుగువాళ్ళకి దేవులపల్లిని తెలియకపోతే ఎలాగ్రా... పల్లకీ కవితరాసిందీ గోరింట పాటను రాసిందీ ఆయనే" అంది లాలస.

"ఇది మల్లెల వేళయనీ" అంటూ ఎత్తుకుంది మాధురి.

"అది కూడా ఆయనే రాశాడు గానీ, ఇది ఆ 'వేళ' కాదు. వందనకు గుర్తుచేయకు" అంది భారతి.నవ్వుతూ.

వీటికేంగాని నేనో ప్రశ్నవేస్తాను. సమాధానం చెప్పు, రాత్రి పెళ్ళికూతురు తాంబూలం వేసుకుంటే తెల్లారేసరికి పెళ్లికొడుకు పెదవులు పండేయట ఎలా?"

భారతి ప్రశ్నకి "ఛీ పొండే" అంది వందన.

"నాల్రోజుల తర్వాత చెప్పబోయే పాఠంలోని ప్రశ్న ఇవాళ అడిగితే ఎలాగే" అంది మాధురి.

అందరూ కిలకిలమంటూ నవ్వారు. సరిగ్గా అప్పుడే వచ్చింది భువన వారి దగ్గరికి. వాళ్ళ సంభాషణ, ఆ నవ్వులూ వింటుంటే ఆమెకీ సరదా అన్పించింది.

"మరి నేనో ప్రశ్నవేస్తాను. మీలో ఎవరైనా చెప్పొచ్చు" అంది భువన. అందరూ చిన్నవయసులోనే పెద్దదాన్లా కన్పిస్తున్న ఎవరీమె అన్నట్లు ఆశ్చర్యంగా చూశారు.

"కొత్త పెళ్ళికొడుకు బుగ్గ గోరింటతో పండేదెప్పుడు?"

అందరూ ముఖాలు చూసుకున్నారు. ఎవరి నోటంటా మాటరాలేదు. ఎవరి మట్టుకువారు ఆమెవంక ఆశ్చర్యంగా చూస్తూ ఆలోచనలో పడ్డారు.

"సరే. ఆలోచించి ఓ గంటలో చెప్పండి. నేను లోపలుంటాను. అన్నట్టు... మీలో ఇంకా పలహారాలు చేయవలసిన వాళ్ళెవరయినా వున్నారా?" అంది.

"అందరూ సుబ్బరంగానే తిన్నారు" అంది జీవిత.

"నాకు రెండు చక్కిలాలు కావాలి" అంది లాలస.

"నాకు రెండు లడ్డూలు" అంది మాధురి.

"పంపిస్తా, మరి జవాబు ఆలోచించండి" అంటూ లోపలికి వెళ్ళిపోయింది భువన.

"ఎవరే ఈవిడ?" అన్నట్లు చూశారంతా ఆమెవంక.

"భువన-మా పెద్దనాన్నగారమ్మాయి" అంది వందన వారి చూపులకు సమాధానంగా

పల్లకీ, పన్నీరు బుడ్డీ వందన అరచేతుల్లో గోరింట చుక్కలుగా చక్కగా అమిరాయి.

◆ ❖ ◆

"వెన్నెల వెన్నెల వెన్నెలా...చల్లని తెల్లని వెన్నెలా...

ఎవరికై వచ్చావు వెన్నెలా...నీవే కథలు తెచ్చావు వెన్నెలా" సాయంకాలం చంద్రోదయ సమయంలో లాలస పాడినట్లు బయట వెన్నెల విరగబూస్తోంది.

మంచిగంధం, మల్లెపూలూ, మనసుకు నచ్చిన జీవిత భాగస్వామీ...కొత్తగా హాయిగా వుంది వందనకి - తొలిరేయి ఆగదిలో - పట్టెమంచంమీద పడుకుని పుస్తకంలోని పేజీలు తిప్పుతున్నాడు చంద్రమౌళి. అది అర్థశాస్త్రసమో, కామశాస్త్రసమో అర్థంకాలేదు వందనకి. కాస్తంత సద్దుమణగనిద్దూ అన్నట్లున్నాయి అతని చూపులు.

చంద్రమౌళితో పెళ్ళి చిత్రంగానే కుదిరింది. కట్నం ప్రసక్తిలేదు. 'మీ బిడ్డకి మీరు ప్రేమతో ఏమిచ్చి పంపితే అదే కానుక' అన్నారు. పురాతనందే అయినా వడ్డాణం, దండకడియాలూ, లతలు చెక్కిన రోజ్‌వుడ్ మంచం, దీవాన్, కొత్తస్టీలు సామానుతోపాటు పాతరసామానూ, మగపిల్లలతోపాటు ఆడపిల్లకీ పంచిన ఆస్తివాటా.

అమ్మాయిని తమ హోదాకీ, గౌరవానికీ తగ్గట్టుగానే పంపాలనే తండ్రి ఆరాటం. మగపెళ్ళివారు మారు మాటలేదు, కోరికలు లేవు, అలకలూ, పట్టింపులూ లేవు. పెళ్ళి అంటే రెండుమనసుల అనురాగసంగమం. అంతే!

అదే అనుకున్నారు, అలాగే జరిగి.ంది. గుడ్డపందిళ్ళూ, ప్లాస్టిక్ తోరణాలూ, కాగితంపూలూ కాదు – సువాసనలతో కూడిన తాటాకు పందిళ్ళు, మామిడాకుల తోరణాలు, పూలదండలతో అలంకరింపబడిన మంటపం, అరటాకు విస్తళ్ళలో విందుభోజనం– పెళ్ళంటే అదీ అన్నట్లు జరిగింది. కన్నె ముత్తయిదువుల పరిహాసాలతో తొలిరాత్రి గడపబోయే శయ్యామందిరానికి దంపతుల తరలింపు.

ఇంటికి ఆనుకుని వెనకగా కట్టిన కొత్త గదిలో అలంకరణ అంతా ఇంతా కాదు. పాత పెరడు ఇప్పుడు గది చుట్టూ చక్కని తోటలా రూపుదిద్దుకుంది.

సద్దుమణిగింది. అతడూ ఆమె ఒక మంచంమీద ఒద్దికగా కూర్చున్నారు. దక్షిణదిశనుండి వచ్చేగాలి కిటికీ తెరలు తోసుకునివచ్చి ఆమె ముంగురుల్ని సవరిస్తున్నాయి. అయినా ఆమె నుదుటచిరుచెమట. పుట్టి బుద్దెరిగిననాటి నుండీ తెలియని కొత్త అనుభూతి మనసులో కలవరాన్ని సృష్టిస్తోంది. చిర్నవ్వుతోనే కొత్తను పోగొట్టి తనదాన్ని చేసుకోవాలనే అతని తపన.

"నీ అందానికి నేను సరిపోతానో లేదో అని భయపడ్డానుసుమా" అన్నాడతడు. కనురెప్పలెత్తి అతనివంక బిడియంగా చూసింది – నీలి మేఘమా? అబ్బే..

'అమ్మాయితో పోలిస్తే అబ్బాయి కాస్తంత ఛాయ తక్కువే...' అమ్మలక్కల్లో ఏదో అసంతృప్తి.

'మగాడు ఆజానుబాహుడూ, సంపాదనాపరుడూ, తెలివైనవాడూ కావాలి అతనికేం తక్కువా? శ్రీరామచంద్రుడు' ఎవరిదో సమర్థింపు. ఆ సమయంలో అదే గుర్తుకొచ్చి అంది వందన – "మీకేం? శ్రీరామచం..."అంటూ ముంచుకువచ్చిన సిగ్గుతో ముడుచుకుపోయింది.

"ఆరుబయటో చంద్రబింబం...గదిలో ఓ చంద్రబింబం... ఇంకా ఈ దీపమెందుకూ" అంటూ దీపం తీసి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. గాఢ పరిష్వంగం, మనసుల్లో కొత్తపులకింత, ఆనందోత్సాహాలతో సంగమం. బయట బయలంతా పరచుకున్న వెన్నెల...గదిలో...ఇరువురి మనసుల్లో పొంగుతున్న ఆనందపు వెల్లువ.

ఎక్కడో గోడగడియారం పన్నెండు గంటలూ కొట్టింది. తొలి కోరికలు ఈడేరిన ఆక్షణం.. ఆనంద పారవశ్యపు అంచులుచూసి కొత్తదంపతులు అలసిన సమయం– "ఏమన్నా మాట్లాడరాదూ" అన్నాడతడు.

"ఏం మాట్లాడాలీ" అంటూనే ఎన్నో మాటలు..ఏవేవో ఊసులు...

తన ఇల్లు, ఉద్యోగం, మనుషులూ, పరిసరాలూ...ఒక్కొక్కటీ చెబుతున్నాడతడు. ఊఁకొడుతునే నిద్రలోకి జారుకుంది వందన. తనూ నిద్రపోడానికుద్యుక్తుడౌతూ ఎందుకో అటుచూశాడు. కిటికీ తెరల చాటున ఏదో అలికిడి. అల్లరంతా అయిందిగా ఇంకెవరొస్తారు అనుకుని కళ్ళుమూసుకున్నాడు. రెండోరోజు రాత్రి కోరికల్లో నిండుదనమూ, కొత్తదనమే నెలకొని వున్నాయిగాని బెరుకులేదు. మాటల్లో చనువు, చూపుల్లో నిలకడ.

"నీ మాటలు బావుంటాయి ఏమన్నా మాట్లాడు" అన్నాడతడు. అదే అదనని అడిగిందామె. "పెళ్ళికొడుకు బుగ్గ గోరింటతో పండేదెప్పుడో చెప్పగలరా?"

ఆశ్చర్యంగా చూశాడామెవంక. ఆమె తడబడింది. సౌమ్యుడూ, తెలివైనవాడూ–అర్థమైందతనికి.

"చెబుతాను, కానీ ముందు నా ప్రశ్నకూ నువ్వు సమాధానం చెప్పాలి" అన్నాడు. సంకోచిస్తునే తలూపింది.

"నిండు అమావాస్య రాత్రికూడా నిండుగా కనబడే చంద్రుడు...?"

దాని సమాధానం గురించి ఆమె చాలాసేపే ఆలోచించింది. చివరకి "నాకు తెలీదు బాబూ" అంది.

అతను మాత్రం ఆమె ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

"అవునూ నువ్వడిగిన ప్రశ్న నీ నోటివెంట రావల్సినదికాదు ఎవరో కొంటెవారే వేసివుండాలి" అన్నాడతను.

"కొంటెవాళ్ళుకాదు. జీవితంలో అన్నీ కోల్పోయిన వాళ్ళే వేశారు. ఆశ్చర్యంగా లేదూ? అది మా భువన ప్రశ్న" అంది. అతడు మౌనంగా ఆమెవంక చూశాడు.

"భువన మా పెద్దనాన్నగారమ్మాయి. తెలిసీ తెలియని పద్దెనిమిదేళ్ళ వయసులోనే పెళ్ళయింది. ఏడాది తిరక్కుండా ఏక్సిడెంట్లో భర్తపోయాడు. మళ్ళీ తండ్రి పంచకు చేరిన ఆమెకు ఆ నీడకూడా కరువైంది. క్రిందటేడాదే మా పెద్దనాన్నగారు కూడా పోవడంతో ఇప్పుడామె మాతోనే వుంటోంది" అంది వందన.

ఆ వెంటనే ఆవులించి అతని గుండెలమీద చెయ్యేసి నిద్రపోయింది వందన చిన్నపిల్లలా. అతడు ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఏదో అలికిడి, కిటికీ ప్రక్క తెరలమాటున ఏదో ఆకారం కదిలినట్లు. నెమ్మదిగా లేచి వెళ్ళాడు. దూరంగా పెరట్లో మంచాలమీద

ఆరుబయట ఎవరెవరో పడుకుని వున్నారు. వెన్నెల మసగ్గా వుంది. ఎవరో తమను చూస్తున్నట్లు అర్థమైందతనికి.

◆ ❖ ◆

మూడోరోజు - మధ్యాహ్నం భోజనాలవుతున్నాయి. చేతులు కడుక్కునేందుకు నీళ్ళందిస్తున్న భువనను చూశాడు చంద్రమౌళి. ముప్ఫయ్ ఏళ్ళు మించవు.

పసిమి ఛాయ, బొద్దుగా పలుచనిచీరలో ఆకర్షణీయంగా కనిపించింది. ఆమె తనచేతులమీద నీళ్ళుపోస్తున్న సమయంలో చుట్టూ ఎవరూ లేకపోవడం చూసి అన్నాడు "కొంటె ప్రశ్నేవేశారు. జవాబు వచ్చిందా" అని.

ఆమె తడబడింది. సిగ్గుతో తలదించుకుంది.

ఆ రాత్రి పదకొండు గంటలసమయం. వందన చిన్న పిల్లలా నిద్ర కాచలేనిదాన్లా నిద్రపోతోంది. ఆ నిద్రలో ధీమా... ఆ ముఖంలో సంతృప్తి. చంద్రమౌళికి ఇంకా నిద్ర పట్టలేదు. ఆ రహస్యమేదో ఛేదించాలన్న కుతూహలం. గదికి రెండోవైపునున్న తలుపు గడియ తీసివుంచాడు. గదిలోని నీలిబల్బును కూడా తీసేశాడు. బైట చంద్రుడు మబ్బుల్లో కూరుకుపోయేడేమో ఎదుటిమనిషిని కూడా గుర్తించలేని పల్చని వెలుగు.

సన్నగా సవ్వడైతే లేచి తలుపు దగ్గరకు వచ్చాడు. బయట మెత్తని అడుగుల చప్పుడు. క్రమంగా దగ్గరౌతోంది! తలుపు తెరుచుకుని బయటకొచ్చాడు. ఎదురుగా ఆమె. వడివడిగా నడిచి తప్పించుకోబోయింది. అతను చేతులడ్డు పెట్టాడు. దోషిలా తల దించుకుని, "క్షమించండి - పెరట్లో ఏదో అలికిడైతేనూ" అంది.

"నేనూ అందుకే లేచాను. అలికిడి పెరట్లో కాదేమో... మనసులోనేమో"

"క్షమించి దారివ్వండి" అందామె.

"క్షమించలేను. మీకు అందని అనుభవం. అందీ జారిపోయిన అనుభవం, మీ అంతరంగంలో రేగిన కోరిక వీక్షణమే కావొచ్చు. తప్పుకదా" అందామనుకున్నాడు. పెదవి దాటి మాటరాలేదు. ఆమె కన్నీటి చుక్క వెచ్చగా చేతిమీద పడింది. చేతులు వెనక్కు తీసుకున్నాడు. ఆమె తన రెండు చేతులూ జోడించి వడివడిగా అడుగులేస్తూ వెళ్ళిపోయింది. తలుపులు వేసి నీలిబల్బు వెలిగించాడు.

◆ ❖ ◆

నాలుగోరోజు ఉదయం - స్నానం చేసి తెల్లని మల్లె పూవుల్లాంటి లాల్చీ పైజామా వేసుకుని పుస్తకం చదువుతున్నాడు చంద్రమౌళి. కాఫీకప్పుతో వచ్చింది వందన. అందంగా, అకర్షణీయంగా వుంది.

"అన్నట్లు నీ ప్రశ్నకు జవాబు చెప్పాల్సిగా...విను. కొత్త పెళ్ళికూతురికి అరచేతుల్లో

పండుతున్న గోరింట – ఎదురుగా జీవిత భాగస్వామియై తను కోరుకున్న ప్రియుడై ప్రేమమూర్తి అయిన పెళ్ళికొడుకు – ప్రేమ ఉప్పొంగి పెదవులు కోర్కెతో రగిలితే అరచేతిగోరింటలూ, పరిసరాలు గొర్తొస్తాయా? చటుక్కున ప్రియుడి ముఖాన్ని రెండు చేతులతోనూ దగ్గరకు తీసుకుని ముద్దాడదూ... మరప్పుడు గోరింట మాత్రం వూరుకుంటుందా అతని బుగ్గల్ని పండించదూ" చెప్పాడతడు.

అతనివంక ఆశ్చర్యంగా చూసి సిగ్గుపడింది వందన.

"అయితే నేనోడిపోయాను. మీ ప్రశ్నకు కూడా జవాబు మీరే చెప్పండి" అంది. చంద్రమౌళి నవ్వేశాడు.

"నేనెందుకు చెప్పాలి, అయిదార్రోజుల్లో అమావాస్య వస్తోందిగా ఆ రాత్రి చంద్రుడు నీ ముందు నిండుగా కనబడకపోతే అప్పుడడుగు" అన్నాడు.

అమావాస్య చంద్రుడెవరో అర్థమైపోయిందామెకు.

◆ ❖ ◆

వందన అత్తవారింటికి ప్రయాణమయ్యేరోజు – ఆ ఇంట హడావుడికి లోటులేదు. చీరసారెలతోపాటు తినుబండారాలూ, అరటిగెలలూ, సామాను, మనసుల్లో దిగుళ్ళు. కార్లు బయల్దేరడానికి సిద్ధమయ్యాయి. స్నేహితుల, చుట్టాల వీడ్కోలు మధ్య వందన కళ్ళనీళ్ళ పర్యంతంగా వుంది. కారు విండో దగ్గరకు వచ్చిన భువన

వందనచేతిని తనచేతుల్లోకి తీసుకొని తట్టివదిలింది. అతనివైపు చూడ్డానికి ఆమెకు ధైర్యం చాల్లేదు.

◆ ❖ ◆

"అనంత నారాయణ అని చిన్నప్పుడు నాతోపాటు చదువుకున్నాడు. తండ్రి చిన్నప్పుడేపోతే తల్లి అయిన వారింట్లో వంటలు చేసి, నీళ్ళబిందెలు మోసి కష్టపడి చదివించింది. కొడుక్కి పెళ్ళిచేసి అదిచూసి చచ్చిపోవాలని ఆశపడింది. కానీ ఆమె ఆశ నెరవేరలేదు. అనంతనారాయణ ఆలోచనలు వేరేగా వుండేవి. చదువులోంచి సంఘసంస్కరణవైపు దృష్టి మళ్ళించాడు. తన తల్లి కోర్కె నెరవేర్చలేకపోయానే అనే బాధతో పెళ్ళి ప్రసక్తే మానుకున్నాడు. దేశమంతాతిరిగాడు. 'మనిషి డబ్బుకోసం కాక న్యాయం కోసం, ధర్మం కోసం బతకాలి' అనే సిద్ధాంతాన్ని ఆచరించి చూపించాడు. అతని సంపాదనేమిటో....జీవితమేమిటో... పేరు ప్రఖ్యాతులు మాత్రం బాగానే గడించాడు. ఇప్పటికీ నేనంటే చచ్చేంత ఇష్టం".

"ఇదంతా ఎందుకుచెబుతున్నారో అర్థం కావటంలేదు" అంది వందన చంద్రమౌళి చెప్పింది విని– "నువ్వు ఒప్పుకుంటే భువన గురించి అతనితో మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు.

నమ్మలేనట్లుగా అతనివంక చూసింది వందన.

"అవును. ఏ మనిషి జీవితమూ వృధాగా గడిచిపోకూడదు. ఆమెను చూసినపుడూ, నువ్వామె గతాన్నిగురించి చెప్పినప్పుడూ అనిపించింది నాకు - పరుగెత్తే ఆమె బ్రతుకు అర్ధాంతరంగా ఆగిపోయిందని!

ఆ వయసులో అది ఆరోగ్యకరం కాదు. తన జీవిత గాలిపటానికి సూత్రం లేక అల్లల్లాడుతోందామె. మీ కుటుంబంలో కలిసిపొందే ఆశ్రయం తాత్కాలికమేకానీ శాశ్వతంకాదు. ఆ తర్వాత? ఒంటరితనం...వయసు కోర్కెలు...చుట్టూవున్న తనతోటివారితో తన జీవితాన్ని పోల్చుకోవడం మొదలౌతుంది. తను జీవితంలో నష్టపోయిందేదో తెలుస్తుంది. అక్కసు... ఈర్ష్యద్వేషం లాంటివి అప్రయత్నంగానే చోటుచేసుకుంటాయి.

ఇవన్నీ జరిగితీరుతాయని కాదు. జరిగే అవకాశముందని చెబుతున్నాను. కారణాలేమైనా ఆమె జీవితకాలం అలానే వుండనక్కరలేదు. కాలం మారింది. పెద్దలు అనుకున్నవారి ఆలోచనా ధోరణుల్లోనూ మార్పు అవసరం." అతనింకా ఏదో చెప్పుకుపోతున్నాడు.

"ఇంతకీ మీరు చెప్పేదేమిటో..." ఆమె ఆగింది.

"మొదట నీ అంగీకారమైతే తర్వాత మీ నాన్నగారితో వివరంగా చెప్పి ఒప్పించడం పెద్ద సమస్యకాదు. నువ్వు భువనను ఒప్పించాలి" అన్నాడు చంద్రమౌళి.

"అమ్మ పోయాక పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచనకే స్వస్తి పలికాను. కానీ... ఆమెకో చక్కనిజీవితం ఏర్పడుతుందని ఆమె భావించి ఒప్పుకుంటే నాకెటువంటి అభ్యంతరంలేదు. నా జీవితానికి ఒక అర్ధం సిద్ధించింది అనుకుంటాను" అన్నాడు. అనంతనారాయణ ఆ రాత్రి చంద్రమౌళి చేసిన అభ్యర్ధనను విని.

భువన అంగీకారం తెలియజేసిన తర్వాత కాదనడానికి ఎవరికీ కారణం కనిపించలేదు.

◆ ❖ ◆

ఏడాదితిరగకుండా ఆ ఇంట మళ్ళీ పెళ్ళికళ నాట్యం చేసింది. పచ్చని తాటాకు పందిళ్ళు. సన్నాయి మేళాలూ.

"ఈ గోరింట వారి బుగ్గల్ని పండించేదెప్పుడో" అంది వందన భువన అరచేతిలో గోరింటను దిద్దుతూ. ఒక్క క్షణకాలంపాటు మౌనం.

"నా జీవితాన్ని పండించిన పుణ్యమూర్తులు... నువ్వూ మీ వారూ..."అంటూ కృతజ్ఞతాపూర్వకంగా వందన కళ్ళలోకి చూసింది పెళ్ళికూతురు భువన.

◆ ❖ ◆